క్లుప్తంగా

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నార్సింగి మండల బీజేపీ నాయకులు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్‌రావును కలిశారు. ఈ మేరకు మండలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మైలారం నర్సింలు, గురుపాదం, లక్ష్మణ్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండలానికి చెందిన 39 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 20 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ షాకీర్‌అలీ, నాయకులు నారాగౌడ్, మధు, ఆర్ఎన్ సంతోష్, రాజేందర్‌గౌడ్, బాసాడ రాజు, సుభాష్‌గౌడ్, సంగమేశ్వర్, పెరుమాండ్లగౌడ్, కుంట్ల రాములు, కుంట్ల శ్రీను, గోవింద్‌రావు తదితరులున్నారు.

గర్భిణులకు ఐరన్ కిట్ల పంపిణీ



గర్భిణులకు మాతృదేవోభవ కిట్లు పంపిణీ చేస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): పోషకాహార లోపంతో పిల్లలు జన్మించకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కాంగ్రెస్ నేత రాజిరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని మాసాయిపేట, వెల్దుర్తి, కుకునూర్, బండపోసాన్‌పల్లి, రామాయిపల్లి, మానెపల్లి తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులకు సొంత ఖర్చులతో ప్రోటీన్, ఐరన్ కిట్లు అందజేశారు. నియోజకవర్గంలో మొదటి విడతగా రెండు వేల మాతృదేవోభవ కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, మహేశ్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాములుగౌడ్, సుధాకర్‌గౌడ్, మల్లేశం అధికారులు పాల్గొన్నారు.

'ఫొటో ఎక్స్‌పో' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): ఫొటోగ్రాఫర్లు నూతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినాయక ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫొటో ఎక్స్‌పో పోస్టర్‌ను తహసీల్దార్ ఆవిష్కరించారు. సెప్టెంబర్‌లో జరిగే ఫొటో ఎక్స్‌పోను ప్రతి ఫొటోగ్రఫీ సభ్యుడు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు సురేందర్‌రెడ్డి, మహేందర్, ప్రవీణ్‌గౌడ్, శంకర్ తదితరులున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలతో విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థుల్లో పోటీతత్వం అలవరిచేందుకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు చౌటకూరి రాంచంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్లు చైతన్య-జయరాంరెడ్డి బ్రదర్స్ అన్నారు. బుధవారం మండలంలోని చండూర్ ఉన్నత పాఠశాలలో గత రెండు బ్యాచ్‌లలో మొదటి స్థానం విద్యార్థులకు రూ.6 వేలు, ద్వితీయ స్థానం విద్యార్థులకు రూ. 5 వేల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాసీం, రాజ్‌కుమార్, నవీన్, ఎంఈఓ విఠల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బతికేదెలా?

- రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతుల ఆవేదన
- భూమికి.. భూమి ఇవ్వాలని డిమాండ్
- మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో



రాస్తారోకో చేపట్టిన రైతులు, నిలిచిన వాహనాలు

కొల్చారం(నర్సాపూర్): మెదక్–బాలానగర్ జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన అప్పాజీపల్లి రైతులు రోడ్డెక్కారు. భూమికి.. భూమి ఇవ్వకుంటే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బాధితులంతా కలిసి మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జాతీయ రహదారిపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. తమకు భూమితో పాటు నష్టపరిహారం ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రాథమిక పాఠశాల వద్ద మూలమలుపు ఉండడంతో రైతుల పొలాల నుంచి రోడ్డు వేసేందుకు అధికారులు, అప్పటి ఎమ్మెల్యే మదన్ రెడ్డి రైతులకు నచ్చజెప్పి రోడ్డు విస్తరణకు మార్గం సుగమం చేశారన్నారు. ఈ విస్తరణలో 34 మంది రైతులు 30 గుంటల భూమి కోల్పోయారన్నారు. ఇందులో భాగంగానే భూమికి భూమి, డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటికీ నెరవేర్చడం లేదని రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ హైమద్ మోహినొద్దీన్, ఆర్ఐ ప్రభాకర్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు సముదాయించే ప్రయత్నం చేశారు. ఎంతసేపటికీ వినకపోతే మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డికి సమాచారం అందించగా.. సమస్యను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం ప్రయాణికులకు ఇబ్బంది కలిగించొద్దంటూ నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్ చారికి వినతిపత్రం అందించారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ తెలిపారు.

అప్పు తెచ్చి సాగుచేశాం

ఆదుకోవాలని మహిళా రైతుల వేడుకోలు



కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్): అప్పులు తెచ్చి సాగు చేస్తే పంటలు చేతికందకుండాపోయాయని, తమకు కన్నీళ్లే మిగిలాయి.. ఆదుకోండి సారూ? అంటూ ఎమ్మెల్యే వద్ద మహిళా రైతులు కన్నీరు పెట్టుకున్నారు. బుధవారం మండల పరిధిలోని పోచారం డ్యామ్ వద్ద కొట్టుకుపోయిన రోడ్డును ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణపై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వస్తున్నాడన్న విషయం తెలుసుకున్న పోచమ్మరాళ్, ఆయా గ్రామాల రైతులు అకాల వర్షాలతో నష్టపోయిన తమను ఆదుకోవాలని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ లేదని, రోడ్లు తెగిపోయి నడవలేని పరిస్థితి నెలకొందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. వర్షాలతో అన్ని గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తాయని, త్వరలోనే బాగు చేసి ఇబ్బందులు తీరుస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరుశరామ్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

టీఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైతి ఐలయ్య



సభ్యత్వ నమోదులో ఐలయ్య, ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ సమస్యలపై టీఆర్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నిరంతర పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బైతి ఐలయ్య అన్నారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో టీఆర్టీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దుచేసి.. పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. 317 జీఓ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉద్యమబాట పట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్సింగి మండల టీఆర్టీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, స్వామి పాల్గొన్నారు.

కాళేశ్వరంపై అసత్య ఆరోపణలు



చిలప్‌చెడ్: ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు గోపాల్‌రెడ్డి, జయరాంరెడ్డి, నర్సింహారెడ్డి, ఖాసీం పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ధర్నా

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట జాతీయ రహదారి 44పై బీఆర్ఎస్ మండల నాయకులు ధర్నా చేపట్టారు. కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఎండగట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని వాపోయారు.ధర్నాలో నాయకులు నాగరాజు, స్టేషన్ శ్రీను, శ్రీనివాస్‌నాయక్, శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్



చిన్నశంకరంపేట: పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్

చిన్నశంకరంపేట(మెదక్): సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్ కోరారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. హెచ్ఓ యాదగిరిరావు, ఎంఎల్‌హెచ్‌పీ హరిక ఉన్నారు.

ముమ్మరంగా పరిశుభ్రత పనులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలో పరిశుభ్రత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆయా వార్డుల్లో పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కౌడిపల్లి(నర్సాపూర్): అన్ని గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశం, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి షరీపొద్దీన్ సూచించారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



నర్సాపూర్: యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. గంటల తరబడి క్యూలో నిల్చున్న యూరియా బస్తా అందడం లేదు. నిత్యం ఎరువుల దుకాణాల చుట్టూ తిరగాల్సి పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. కాగా, బుధవారం నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద గంటల తరబడి నిరీక్షించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ ఆరోపణలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో దశలవారీగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ మేరకు రోడ్ల అభివృద్ధికి రూ.30కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాన్‌కిషన్, యూసూఫ్, సత్యనారాయణ, సత్యం, మల్లారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పాపయ్య, భూంరెడ్డి, శ్రీధరాచారి, నర్సింహారెడ్డి, మహేష్, రవిబాబు, అవినాష్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేష్, సెవ్యానాయక్, మాదయ్య, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **సైబర్ నేరాలపై అవగాహన**

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సైబర్ నేరాలపై ఎస్ఐ హైమద్ మోహినొద్దీన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంకు వివరాలు చెప్పకూడదన్నారు. అనుమానం వస్తే నేరుగా బ్యాంకుకు వెళ్లి సమాచారం అందించాలని సూచించారు.

◆ **సామాజిక తనిఖీపై సమావేశం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధిహామీ సామాజిక తనిఖీపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఆడిట్ సిబ్బందితో కలిసి బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ ఆడిట్ సిబ్బంది మండలంలోని ప్రతి గ్రామంలో పది రోజుల పాటు ఉపాధిహామీ పనులు 2024–25కు సంబంధించిన వివరాలు సేకరిస్తారన్నారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఇన్‌చార్జ్ ఎంపీఓ తిరుపతి పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని డీఈఓ రాధాకిషన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిట్కుల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన రాంచంద్రారెడ్డి పదవీ విరమణ అభినందన సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ, ఎంఈఓ, తోటి ఉపాధ్యాయులు ఆయనను సన్మానించి, /జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **నేడు ఆర్వోబీ పనులకు శంకుస్థాపన**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని రైల్వే గేటు వద్ద ఆర్వోబీ పనులకు ఎంపీ రఘునందనరావు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయనున్నట్లు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 5న మధ్యాహ్నం 3గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కావున ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ **కష్టపడి చదివితేనే ఉత్తమ భవిష్యత్**

నర్సాపూర్ రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సమీరా నజ్మీన్ సూచించారు. బుధవారం డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ విద్య కొత్త ప్రయాణం లాంటిదన్నారు. క్రమశిక్షణతో పాటు కఠిన శ్రమతో చదివితే మంచి విజయాలను సాధించవచ్చన్నారు. విజ్ఞానం నైపుణ్యాలతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ హిమత్ కుమార్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అదెప్ప, అధ్యాపకులు రమేష్, మహమ్మద్ ఖాజ ఆరి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సురేష్ కుమార్, మహేందర్ రెడ్డి, రాజు, రాములు, జానకి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

◆ **రోడ్డుకు మరమ్మతులు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని శీలాంపల్లి ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో గ్రామస్తులు, బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఎల్లయ్యగారి రాజేందర్ రెడ్డి బుధవారం మరమ్మతులు చేశారు. ఈ మేరకు రూ. 40 వేల సొంత ఖర్చులతో మట్టిని తెప్పించి రోడ్డుకు మరమ్మతు చేయించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజమే



శివ్వంపేట: విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): క్రీడల్లో గెలుపోటములు సహజమని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మండల పరిధి గోమారం హై స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు ప్రతిభ కనబర్చాలని కోరారు. అనంతరం క్రీడా పోటీలకు ఆర్థికసాయం అందించిన వెంకట్‌రామిరెడ్డిని ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, వార్డెన్ భానుసింగ్, నాయకులు మాధవరెడ్డి, లక్ష్మీకాంతారావు, వేణుగోపాల్ రెడ్డి, ఆంజనేయులు, మోహన్‌గౌడ్, శ్రీనివాస్, తిరుపతిరాథోడ్, తదితరులు ఉన్నారు.

తునికి ఎంజేపీలో..

కౌడిపల్లి(నర్సాపూర్): క్రీడల్లో ప్రతిభ చాటితే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ బాలరాజు తెలిపారు. బుధవారం మండలంలోని తునికి ఎంజేపీలో ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభించారు. ఎంజేపీ ప్రిన్సిపాల్ హరిబాబు, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కృష్ణ, పూర్ణచందర్, శేఖర్, పీఈటీలు క్రిష్ణ, అజీమ్, పాంశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

అల్లాదుర్గం(మెదక్): చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని ఎంఈఓ ధనుంజయ అన్నారు. మండలంలోని ముస్లాపూర్ జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి క్రీడలను బుధవారం నిర్వహించారు.

పంట సస్యరక్షణతో అధిక దిగుబడి

లయోలా కళాశాల వ్యవసాయ విద్యార్థులు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంటల సాగులో సకాలంలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని లయోలా కళాశాల వ్యవసాయ విద్యార్థులు అన్నారు. మండలంలోని శీలాంపల్లిలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ ఆధ్వర్యంలో రైతులకు వరి సాగులో మెడవిరుపు తెగులుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరిలో వ్యాపించే మెడవిరుపు తెగులు ఆశిస్తున్నాయన్నారు. వీటి నివారణకు ట్రైసైక్లోజల్, మాంకోజెబ్ 2.5 గ్రాము లు లేదా ఐసోప్రొథయోలిన్ 1.5 ఎంఎల్, లేదా కాసుగామైసిన్ 2.5 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అయితే తెగులు ఉధృతితో 10–15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పూజశ్రీ, ఉషాశ్రీ, శ్రీదివ్య, అరుణజ్యోతి, రుచిత రైతులు పాల్గొన్నారు.

లంబోదరుడికి విశేష పూజలు



హవేళిఘణాపూర్: వినాయకుడి శోభాయాత్రలో ఎమ్మెల్యే రోహిత్



నర్సాపూర్: డీఎస్పీ, అధికారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

వినాయక నవరాత్రులను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయకులకు మండప నిర్వాహకులు బుధవారం పూజలు నిర్వహించారు. ఈ మేరకు నర్సాపూర్‌లో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు పోలీసులను శాలువాలతో సన్మానించారు. అలాగే కౌడిపల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, హవేళిఘణాపూర్‌లో నేతాజీ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి శోభాయాత్రలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కళా ఉత్సవ్‌లో అలరించిన విద్యార్థులు**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో బుధవారం మండల స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మండలంలోని జెడ్పీ పాఠశాలలు, కేజీబీవీ, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పుష్పవేణి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాణికుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గీత పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు అవగాహన**

రేగోడ్(మెదక్): సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ పోచయ్య అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అదే విధంగా గతంలో పోగొట్టుకున్న నాలుగు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు.

◆ **ఎమ్మెల్యే పరామర్శ**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో ఓ పత్రికకు చెందిన విలేకరి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, రాజిరెడ్డి, నాయకులు ఉన్నారు.

◆ **విద్యా ప్రగతిపై సమీక్ష**

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థుల్లో పురోగతి ఉండాలని ఎంఈఓ శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు ఎంఆర్సీ కార్యాలయ ఆవరణలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులతో విద్యా ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. తరగతి గదిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సదస్సులో కాంప్లెక్స్ ప్రథమ ఉపాధ్యాయులు రేవతి, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

◆ **భక్తిశ్రద్ధలతో నారాయణ హోమం**

ఝరాసంగం(జహీరాబాద్): బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో నారాయణ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యాణార్థం 60 రోజులుగా మరకత ఇష్టలింగ పూజతో పాటు రుద్రాభిషేకం బిల్వార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ముగింపు సందర్భంగా ఆశ్రమంలో హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు సీసీసీ 108 వైరాగ్య శిఖామని అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామి, మాతృశ్రీ అనసూయ మాత, కర్ణాటక ఎమ్మెల్సీ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎస్‌జీఎఫ్ క్రీడల్లో కుర్తివాడకు బహుమతి**

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా వాలీబాల్ పోటీలో కుర్తివాడ ఉన్నత పాఠశాల జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. అండర్ 17 బాలురు విభాగంలో ప్రథమ స్థానం పొందినట్లు చెప్పారు. అలాగే బాలికల 14 విభాగంలో మొదటి బహుమతి, అండర్ 17లో ద్వితీయ బహుమతి సాధించినట్లు ఆయన వివరించారు.

◆ **అన్ని వర్గాలకు బ్యాంకు సేవలు**

పాపన్నపేట(మెదక్): డీసీసీబీ పరిధిలో అన్ని వర్గాల ప్రజలకు రుణ సౌకర్యాలు కల్పిస్తామని ఆ బ్యాంక్ మేనేజర్ కిషన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మిన్‌పూర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు.డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.20 లక్షల వరకు రుణాలిచ్చామని చెప్పారు. అలాగే బంగారు ఆభరణాలపై రుణాలు కూడ ఇస్తున్నామని, లాకర్ సౌకర్యం కూడా ఉందన్నారు.

◆ **రోడ్డు ప్రమాదంలో గాయాలు**

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన తూప్రాన్–నర్సాపూర్ రహదారిపై శివ్వంపేట గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. తిమ్మాపూర్‌కి చెందిన ఆంజనేయులు, శ్రీను, అచ్చంపేటకు చెందిన గోవర్ధన్‌లు యూరియా కోసం స్థానిక పీఏసీఎస్ వచ్చారు. క్యూ పెద్దగా ఉండడంతో టీ తాగేందుకు మండల కేంద్రం వద్దకు వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తుండగా బొలెరో ఢీకొట్టి వెళ్లిపోయింది. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఆంజనేయులు పరిస్థితి విషమంగా ఉండడంతో బాధితుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

◆ **అక్రమ నిర్మాణాల కూల్చివేత**

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని అజంపురా వీధి క్రీడా ప్రాంగణంలోని అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు బుధవారం జేసీబీలతో కూల్చివేశారు. క్రీడా ప్రాంగణంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై స్థానికులు ప్రజావాణిలో ఉన్నతాధికారుల దృష్టికి పలు మార్లు ఫిర్యాదులు చేశారు. ఇందులో భాగంగా అక్రమ నిర్మాణాలను జేసీబీలతో తొలగించారు. ఈ విషయంపై మున్సిపల్ టీజీబీఓ భూపతి వివరణ కోరగా.. అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు రావడంతో కూల్చివేసినట్లు తెలిపారు.

◆ **కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

నర్సాపూర్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు నాగరాజు, పుష్ప, రాంలు, శంకరయ్య, అనిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు పూర్తి చేయాలి**

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ నిర్మాణాలు పూర్తిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాందాస్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్ఓ భుజంగరావుకు వినతి పత్రం అందజేశారు.